## శృతిమించిన టీనేజ్ సరదా ఒక అమ్మాయిని ఎలా బలితీసుకుంది?

# పరాజిత

మండల రామారావు కథ

''ఏమోయ్! లేవవోయ్! చూడు చూడు. ఉదయభానుని సప్తహయములు ఎలా నురుగులు కక్కుతూ ఎగిసిపడుతున్నాయో చూడు. అద్భుతం. అత్యద్భుతం. నయనానందకరం అంటూ అర్ధనిద్రలో వున్న తన అర్ధాంగి చుబుకంమీద చూపుడు వ్రేలితో మీటుతున్నాడు రాజసింహ. ఆంగ్లభాషాబోధకుడైనా తనకున్న ఆంధ్రభాషా పరిజ్ఞానాలన్నీ ప్రదర్శిస్తున్నాడు రాజసింహ. ఉత్తర దిశగా పయనిస్తున్న రైలు ఒక్కసారి తూర్పుకు తిరిగి నేరుగా సముద్రాన్ని తాకడానికి వెళ్తున్నట్లు, ప్రప్రథమంగా తిలకించేవారికది ఒక వింతగాను, పులకింతగాను, పసందైన కనువిందుగాను ఆ దృశ్యం విచిత్రంగా వుంటుంది. అందుకే అటు చూడమంటూ భార్యని నిద్ర లేపుతున్నాడు రాజసింహ.

''ఊ! వుండండి. అప్పుడే విజయనగరం వచ్చిందా! ఆ... హు... అంటూ గోముగా, గారాముగా అరమోడ్పు కన్నులతో అతనివంక చూచి మరల ముసుగుపెట్టి పడుకుంది ఆమె. వేగంగా వెళ్తున్న రైలు ఒక్క కుదుపు ఒక్కసారిగా ఆగింది. ఆ ఊపుకు బెర్త్‌నుండి క్రిందపడబోయిన ఆమె ఒళ్లు విరుచుకుని బద్ధకాన్ని పారద్రోలి ఆవులిస్తూ లేచికూర్చోవడంతోపాటు ఎదురుగా కనబడుతున్న సూర్యుని వెలుతురు చూడడంతో ఒకసారిగా ఆమె త్రుళ్లిపడింది.

ప్లాట్‌ఫారంమీద జనంయొక్క రణగొణధ్వనులు ఒక ప్రక్కన కూలీ... కూలీ అంటూ ఎర్రటి యూనిఫారములలో వున్న పోర్టర్ల అరుపులు మరొకప్రక్క - బాబూ పైసా ధర్మం చేయండి అనే భిక్షకుల యాచనలు వేరొకప్రక్క. ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం పైవేటుగా వచ్చి ఎదురుగా బయలుదేరిన మద్రాసుమెయిలు ఘీంకారం ఇంకొకప్రక్క -



బోగీలనుండి సామానులు దింపుకునేవారు కొందరు. వారిని బలవంతంగా నెట్టుకుంటూ లోనికి వచ్చేవారు మరికొందరు. టీ కాఫీ అంటూ వారి వారి ధోరణులలో అరుస్తున్నవారు మరికొందరు. ఏమిటో అంతా చిత్ర విచిత్ర ధ్వనులు. వేణుమాధవ్ మిమిక్రీ గుర్తుకొచ్చింది ఆమెకు.

ఇంతలో జనాన్ని త్రోసుకుంటూ ఓ స్త్రీ పెట్టే జడతో లోనికి వచ్చి వాటిని రాజసింహ దంపతుల

ప్రక్కగా విసిరి చేతిలో వున్న తొమ్మిది నెలల పసికందును రాజసింహ అర్ధాంగి ఒడిలోనికి సామానులాగా విసిరి మిగిలిన సామానుకొరకు మరల గేటువద్దకు వెళ్లి తన భర్తవద్ద వున్న ఆఖరి సూట్‌కేసును అందుకుని 'హమ్మయ్య' అంటూ ఇద్దరూ వచ్చి రాజసింహ ప్రక్కనే కూర్చున్నారు. రాజసింహ తన భార్యను కాఫీకి దిగమని ప్లాట్‌ఫారమ్‌వైపు చూపిస్తున్నాడు. ఆమె వినలేదు. కనీసం ఫ్లాస్కు అయినా ఇమ్మని అడిగినా ఆమె వద్దని అతని చేతిని గుంజి కూర్చొనబెట్టింది. రాజసింహ ఆమె ప్రక్కనే చతికిలబడ్డాడు. రాజసింహకు ఈ వింతధోరణి అర్థంకాలేదు. ఆమె ముఖంలోనికి చూచాడు. ఆమె ముఖం జేవురించి వుంది. ఏదో ధీర్ఘాలోచనలో మునిగినట్లనపించింది అతనికి. కారణం అడిగే సమయం కాదు రాజసింహకు. రైలు కదిలే వేళయింది. సిగ్నల్ పడింది. గార్డు విజిల్ వేశాడు. విజిలుతో పాటు పచ్చజెండా ఊపడం కూడా ఆమెకు కనిపించింది. పది నిమిషాలు పేడమరదిశగా వెనుకకు వెళ్లిన రైలు ఒక్కసారిగా ఉత్తరానికి తిరిగింది. రైలు విశాఖ దాటింది. విజయనగరం ఇంకా చాలా దూరముందని భావించిన ఆమె మనసులో మధన ఏర్పడింది. తన చేతిలో పిల్లాణ్ణి తిరిగి తీసుకుంటున్న తల్లిని చేతితో పొడిచి ఏదో అడగమంటున్నాడు పిల్లాడి తండ్రి. ముందు సందేహించి తదుపరి ''మీరు సునందగారా?'' అంది పిల్లాడి తల్లి.

''మీకెలా తెలుసు?'' తిరిగి ప్రశ్నించింది ఆమె.

''వారు తెలుసుకోమంటున్నారు'' అంది తన భర్తవంక చూపుతూ.

''వారెవరు?'' తిరిగి ప్రశ్నించింది రాజసింహ అర్ధాంగి.

''మావారు! కృష్ణచంద్ర కాశ్యప. విశాఖపట్నం జాబ్ ట్రయల్స్‌కు విజయనగరం వస్తున్నారు. నేనక్కడ కాలేజీలో తెలుగు లెక్చరర్ని'' అంటూ గలగలా చెప్పింది ఆమె.

సునంద అతని ముఖంలోకి సూటిగా చూసింది. అతను తల దించుకునే నేలచూపు చూస్తున్నాడు. కొద్దిగా గడ్డం పెంచుకుని భార్య చేతిలో కీలుబొమ్మలా అనిపించే అతని అభినయ చేష్టలు చూస్తుంటే భార్యదే కొంచెం అప్పర్‌హేండ్‌గా ఊహించింది ఆమె.

''ఔను. నేను సునందనే'' అంటూ తల ముందుకు ఊపింది సునంద. తలదించుకుని ఉన్న కాశ్యప ఒక్కసారి సునంద కళ్లలోనికి నేరుగా చూచాడు. సునంద నయనాల వెనుకనుండి పొంగి పొరలివస్తున్న భావోద్వేగ జ్వాలలను బలవంతంగా మనసులోనే నొక్కిపట్టుకుంటున్నా ఒక్కొక్క అశ్రుబిందువు నేలరాల్చడం తప్పనిసరి అయింది ఆమెకు. ఆ సంఘటనను అర్థం తెలుసుకొనలేక పోయినాడు. తన భార్య సునంద మనసు చాలా సున్నితం. చిన్న పిల్లల మనస్తత్వం లాంటిది. అది ప్లాస్టిక్ అండ్ ఎలాస్టిక్‌గా తనకు తెలుసు. అందుకే ఆమెయొక్క మనోవైకల్యానికి, భావ వికారానికి కారణం తెలుసుకొన ప్రయత్నించలేదు. కొత్తగా పెళ్లయి కాపురానికి వస్తున్న ఆమెకు తన తల్లిదండ్రులు జ్ఞప్తికి వచ్చారేమోనని సరిపెట్టుకున్నాడు.

'ఇదేదో పాత ప్రేమకథ' ఈ స్త్రీజాతిని నమ్మకూడదని తన భర్త తనను అపార్థం చేసుకుంటాడేమోననే ఆవేదన ఒక ప్రక్క. ఆపుకోలేని తన మనోవేదన మరోప్రక్క. ఏదో తీవ్రమైన కారణం లేకపోతే తనని కాఫీకూడా తీసుకుని రాకుండా అడ్డుపడిన ఆమెయొక్క బాధను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు రాజసింహ. రైలు సకాలంలో తన గమ్యస్థానానికి చేరుకొనడానికి తన గమన వేగం పెంచింది.

కాస్యపను విలన్‌గా తన భర్త రాజసింహ భావిస్తున్నాడేమోననే అనుమానంతో సునంద మనసు కకావికలమయింది. కాస్యప అక్కడనుండి లేచి కిటికీ ప్రక్కన కూర్చున్న పెద్దాయనను ప్రాధేయపడి ప్రక్కన చోటు చేసుకుని కిటికీ చువ్వలగుండా వెనక్కు పడుతున్న గుట్టలను, గోతులను, గడ్డిపూవులను, గుడ్డిపూవులను, కొండముందున్న లోయలను, ప్రకృతి రమణీయతలనుకూడా ఆస్వాదిస్తున్నాడు.

సునంద బలవంతంగా తన భావోద్రేకాన్ని అదిమిపెట్టుకుంటూ హోరుగాలికి ముఖాన్ని అడ్డుకుంటున్న ముంగురులను ఎడమ చేత్తో పైకి పెట్టుకుంటూ, జారుతున్న పైటను భుజంచుట్టూ త్రిప్పుకుంటూ మరొక కిటికీలోనుండి వెలుపలకు చూస్తున్నది. తాను ఎంత మరచిపోదామనుకున్నా మరువలేని ఆ దుస్సంఘటన తన కళ్లకు కట్టినట్లుగా ఇంకమూ ఆమెకు మదిలో మెదులుతోంది.

తాను రాజసింహ ఒడిలోనికి చేరి గత చరిత్రను వివరించి తన బాధకు కారణభూతమైన ఈ ప్రయాణాన్నిగూర్చి వివరించుటకు ఇది సమయం కాదని వెరిసింది.

అపార్థాలకూ, అనర్థాలకూ దారితీసే ఏ సంఘటనా జరుగకూడదని తన భర్త తనను యథావిధిగానే ప్రేమించాలనీ ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనలు ఆమె మస్తిష్కంలో చోటుచేసుకుంటున్నాయి. ఆమె మరలా కాస్యపవైపు చూడడానికి ప్రయత్నించలేదు. కనీసం అతని అర్ధాంగివైపైనా చూడడానికి ప్రయత్నించలేదు. తన ఆలోచనల్లా విధి తనకు విధించిన కఠిన శిక్షనుగూర్చి మాత్రమే. తన జీవితంలో మరచిపోవాలన్నా మరచిపోలేని ఆ బాధామయ గాథను గూర్చి అర్థాంతరంగా తనకు జ్ఞప్తికి చేసిన కృష్ణచంద్ర కాశ్యప ఈనాటి తన తోటి ప్రయాణం మాత్రమే. ఆ! అదే సుప్రియ చరిత్ర.

◆ ❖ ◆

''లాసన్స్ బేకి వెళ్దామా! వేవీగార్డెన్స్‌కు వెళ్దామా సునందా?'' ప్రశ్నించింది సుప్రియ.

''రెంటికీ వద్దు. రామకృష్ణా మిషన్‌కి వెళ్దాము'' సమాధానమిచ్చింది సునంద.

''రేపు ఆదివారం బాయ్‌స్‌కూడా పిక్నిక్‌కు డాల్ఫిన్స్ నోస్‌కి వెళ్తారటే! కనీసం అక్కడికైనా వెళ్దామే!'' అంది సుప్రియ.

''అందుకే వద్దంటున్నాను'' అంది సునంద.

## మత్తు సైన్యం



రష్యా సైనికులు చాలామంది మాదక ద్రవ్యాలువాడుతున్నట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వశాఖ తెలుసుకుంది. దాంతో అమెరికా నేవీ డాక్టర్ల సహాయంతో తమ సైనికులపై డ్రగ్ టెస్ట్ జరిపింది. సోవియట్ సైనికులకూ, పౌరులకూ మాదకద్రవ్యాలవాడకంవల్ల కలిగే అనర్థాలను వివరించడానికి ఓ కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. దీనికి అమెరికా తన సహాయ సహకారాలను అందిస్తోంది.

\- రజనీ

సునంద అబ్బాయిలతో అలాంటి చోట్లకు ప్రయాణం కట్టడానికి సుతరామూ ఇష్టపడదు. అందుకే సుప్రియా సునందల భావాలు ఉత్తర దక్షిణ ధృవాలు.

సుప్రియ ప్రకృతి ఆరాధకురాలు. కొండలు, గుట్టలు, లోయలు, సముద్ర తరంగాలు, పూవులూ - మత్తెక్కించి మైమరపించేవాటి సుగంధ సౌరభాలూ, సహ విద్యార్థినీ విద్యార్థులతోపాటు ఆటపాటలు... ఇవీ ఆమె అభిరుచులు. సునందకు దైవభక్తి, పుణ్యాలు, పాపాలు, దేవుళ్ళు, దయ్యాలు... వాటిమీద నమ్మకం. శ్రీశైల మల్లికార్జునస్వామి మొదలుకుని శ్రీకాకుళం కాకుళేశ్వరస్వామివరకు, విజయవాడ కనకదుర్గ మొదలుకుని విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారివరకు ఆమె ఆరాధ్యదైవాలేకాక వారి మహత్యాలమీద అచంచల విశ్వాసం. భిన్న మనస్తత్వాలుగల వారిద్దరికీ జంట ఎలా కలిసిందో అంతుబట్టని కొందరు సహ విద్యార్థినులు అసూయపడడంకూడా కద్దు.

ఆరోజు యూనివర్శిటీ కేంపస్‌లో ఏదో కలకలం. అదే రాగింగ్. "పాపం జూనియర్ స్టూడెంట్స్‌ని చూస్తుంటే నాకు జాలి కలుగుతుంది! రాగింగ్ చేయడం నేరం కాదటే! వారు అనుభవించేది నేరం కాదటే! ఫస్టియర్‌లో బాధ అనుభవించినవారే సీనియర్స్ కాగానే కనీసం వారు జూనియర్స్‌ని రాగింగ్ చేయడానికి ప్రయత్నించునప్పుడు తాము జూనియర్స్‌గా వున్నప్పుడు అనుభవించిన బాధ గుర్తుకు రాదటే! వెర్రితలలు వేసిన ఈ రాగింగ్‌వలన జూనియర్ విద్యార్థులు ఎందరు బలవుతున్నారో తెలుసా!" అంది సునంద.

"అలాంటివారు పిరికివారు. అది కేవలం ఫన్ మాత్రమేకాదు. కొత్తగా చేరినవారికి కాలేజీ భయంపోవడానికి అదో ప్రాథమిక ప్రక్రియ. అది ఓ టానిక్ కూడాను. ఈ వ్యవహారాన్ని అంత సీరియస్‌గా తీసుకోవడం విద్యార్థుల బలహీనతే అవుతుంది. అలాంటివారు జీవితంలో పైకి రాకపోగా జీవితాంతం పిరికివారుగానే మిగిలిపోతారు" అంటూ సబిన్స్‌పెక్టర్ పోలీస్ హెడ్‌కానిస్టేబిల్‌ను "యూ ఆర్ ఏ ఫూల్" అంటాడు. 'ఎస్ సార్' అంటాడు హెడ్‌కానిస్టేబుల్. మరి అదే హెడ్‌కానిస్టేబుల్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా ప్రమోట్ కాగానే 'యు ఆర్ ఏ ఫూల్' అంటాడు క్రింద హెడ్‌కానిస్టేబుల్‌ను. 'ఎస్‌సార్' అంటాడు అతనుకూడా. తాను హెడ్‌గా వుండగా తనను ఎస్.ఐ. ఫూల్ అన్న మాటలు విన్నప్పుడు పొందిన అవమానం, ఆవేదన అతను ఇప్పుడు గుర్తుకు వచ్చినా క్రింద హెడ్‌ను అలా అనడం మానడేం? రాగింగ్ కేవలం అలాంటిదే! అది ఒక సాంప్రదాయం, ఆచారం, ఆనవాయితీ. భయమనే భూతాన్ని పారద్రోలే ఓ మంత్రశక్తి" అంది సుప్రియ.

ఆదివారం రామకృష్ణా మిషన్‌కే వెళ్లడానికే ఓటు వేసుకుని ప్రార్థనా మందిరంలో ఓ మూల చోటుచేసుకుని కూర్చున్నారు ఇరువురు. స్వామీ అవధూతానందస్వాములవారి ఆశీర్వచనాల అనంతరం అలా రోడ్డుమీదకు రాగానే బీచ్‌నుండి వస్తున్న కృష్ణచంద్ర కాశ్యప తారసపడ్డాడు వారికి. అలా ప్రతిరోజూ ఏదో ఒక ప్రదేశంలో ఎదురు పడుతూనే వుంటాడు కాస్సేపు వారిద్దరికి. అది కేవలం యాదృచ్ఛికం కావచ్చు. "ఆ పిల్లాణ్ణి చూస్తుంటే జాలివేస్తుందే! రోడ్డుమీద తల వంచుకునే నడుస్తాడు. క్లాసులో తల దించుకునే సమాధానం చెప్తాడు. పాపం మరో ప్రపంచం" అంది సుప్రియ.

"నేను గమనించలేదు" అంది సునంద.

"మనం అతనిని పలకరించి తమాషా చేద్దామా?" అంది సుప్రియ.


"ఛాఛా! దారిని పోయే ప్రతి మగాణ్ణీ పలకరించడమో, గేలి చేయడమో స్త్రీజాతికి,

ముఖ్యంగా విద్యార్థినుల లక్షణం కాకూడదు'' అంది సునంద.

''దేవుడు నయనాలు ప్రసాదించింది అందాన్ని ఆస్వాదించి ఆనందించడానికి. నోరు ఇచ్చింది పరామర్శించి పలుకరించడానికే గదటే!'' అంది సుప్రియ గలగల నవ్వుతూ. కనీసం బీచ్‌కి వెళ్లి కొంతసేపు కాలం గడుపుదామన్నా సుప్రియ కోర్కెను త్రోసిరాజంది సునంద.

''చీకటి పడకముందే హాస్టల్‌కు చేరుకొనుట మంచిది. అదిగో చూడు! హాస్టల్ కిటికీ రెక్కలు వింత శబ్దాన్ని చేసుకుంటూ మనల్ని త్వరగా రమ్మని ఆహ్వానిస్తున్నాయి'' సముద్ర హోరుగాలిని ఆలకిస్తూ అంది సునంద.

''ఓకే'' అంది సుప్రియ. ప్రొద్దు కొండ వెనుకకు జారినట్లే రోడ్డుమీదనుండి చల్లగా హాస్టల్‌లోనికి చేరుకుని పుస్తక పఠనంలో నిమగ్నులైనారు వారిద్దరు. అటు హాస్టల్‌లోగాని, ఇటు యూనివర్శిటీలోగాని ఎవరినోట విన్నా వీరి సంగతే! సునందా సుప్రియల నామధేయాల్ని స్మరించనివారుగాని, వారి మూర్తులను మనసులో ఆరాధించుకొననివారుగాని అరుదు అంటే అతిశయోక్తి కాదేమో! వారి అందానికి వెలగట్టి ఆ విషయాన్ని చర్చించని వారుండరు. వారిని జంటపక్షులు అని ఒకరు విశ్లేషిస్తే, రాయంచలు అని ఇంకొకరు సంబోధిస్తే, మిస్ యూనివర్శిటీ, మిస్ యూనివర్స్‌లు అని మరొకరు వర్ణిస్తే మాధురీదీక్షిత్, మీనాక్షి శేషాద్రిలుగా వేరొకరు భావిస్తారు. అందుకే తన చుట్టూ తిరుగుతూ సునందా సుప్రియల చుట్టూ పరిభ్రమించే సంస్కృతం స్పెషల్ సబ్జక్టుగా తీసుకున్న మార్తాండశాస్త్రి తన క్లాసులోని ప్రొఫెసర్ 'కుమార సంభవం' బోధిస్తున్నప్పుడు మనసులో అనుకునేవాడు. ''కాళిదాసూ! నీవు మా తరంలో జన్మించకూడదూ! జన్మించి కుమార సంభవంలాంటి కావ్యాన్ని మరల వివరించకూడదూ! వివరించి పార్వతిని నీవు నఖశిఖపర్యంత వర్ణించినట్లు సునందా సుప్రియల అందమైన ఆకారాలను అలానే వర్ణించకూడదూ! ముఖ్యంగా కుమార సంభవంలోని ఆ 'కంఠస్యతస్యాన్తన బంధురస్య ముక్తా కలాపస్యచనిస్తలస్య అన్యోన్య శోభాజననాత్ భభూవ సాధారణో భూషణభూష్యభావః'' అనే శ్లోకం వీరిద్దరికి ఎంచక్కా నప్పుతుందో! అనుకుంటూ వారిద్దరి అందానికి అర్రులు చాస్తూ ఆకాశాన్ని విహరించే శాస్త్రిలాంటి చాతక పక్షులు ఆ



యూనివర్శిటీ హాస్టలులో కోకొల్లలు.

కవులవర్ణనలకు ఉపకరించే వయ్యారపు వంపుసొంపులు, చిత్రకారుల కుంచెలకు పసందైన ఆహారాన్ని అందించే అందచందాలు వారిద్దరిలో వున్నవంటాడు కీర్తిచంద్రదేవ్. 'శ్వేతహరిణులు' అంటాడు రాజ్ బహద్దూర్. 'నాట్యమయూరి'లు అని అభివర్ణిస్తాడు అయ్యన్నరెడ్డి. వారి ఆకారాలను హృదయాలలో దాచుకుని దోబూచులాడుకుంటారు మరికొందరు విద్యార్థులు, అందుకే శకుంతలాపట్నాయక్, స్వరణ్ పాల్లి, ప్రేమా శ్రీనివాస్‌లాంటి సహవిద్యార్థినులకు కూడా సునందా సుప్రియలంటే ప్రాణం.

సహజంగా సౌమ్యంగా వుండే సునంద ఆరోజున ఒకచేదు అనుభవాన్ని చవిచూడవలసి వచ్చింది. అది ఆమె దృష్టిలో జుగుప్సాకరమైన, హేయమైన, నీతిబాహ్యమైన వింత అనుభవం. క్లాసులో ఎదురుగా కూర్చున్న శివశంకర్ ఆమెవంక తదేక దీక్షతో చూస్తూ మధ్యలో కన్నుగీటాడు. సునంద ఉలిక్కిపడింది. సెన్సిటివ్ అయిన ఆమె ఆ సంఘటనను సుప్రియకు వివరించి ఖేదించింది. సుప్రియ వద్దని వారించినా సునంద ఆ అపసవ్యపుచర్యను ప్రిన్సిపాల్‌కు రిపోర్టు ఇవ్వక మానలేదు.

ప్రిన్సిపాల్ శివశంకర్‌ను తన రూముకు పిలిచాడు. రూమ్‌లోకి ఎంటర్ కాగానే 'డోన్ట్‌యు హేవ్ డీసెంట్ మానర్స్?' అని అంటూ మందలిస్తుండగానే ప్రిన్సిపాల్‌కు కన్నుగీటాడు శివశంకర్. అతనికి అదో రుగ్మత అనుకుని శివశంకర్‌ను పనిష్ చేయకుండా వదిలివేశాడు ప్రిన్సిపాల్.

ఈ విషయం ఇతర క్లాసులకు ప్రాకింది. యూనివర్శిటీ అంతా పాక్కింది: వేడి వేడి వార్త అయింది. సునంద ఆ అవమానాన్ని భరించలేక సను కాలేజీనుండి వెళ్లిపోతాననీ, ఆత్మహత్య చేసుకుంటాననీ వాపోయింది సుప్రియతో. చూడు సునందా! ఇదీ ఒక అవమానమేనా! ఆ కుర్రాడేకాని నాకు కన్నుగీటి ఉన్నట్లయితే నేనుకూడా తిరిగి అదే పని చేసి వుండేదాన్ని. అప్పుడు అతను 'ఫూల్' అయి వుండేవాడు. విద్యార్థి దశలో ఇంతకంటే విపరీత సంఘటనలు సంభవించడం సహజం. వాటిని ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలి. ఈజీగా తీసుకోవాలి. ఇలాంటి అవహేళనలూ, అవమానాలూ తప్పవు. వాటిని ఎదుర్కుంటూ ఢీకొంటూ పోవడమే ధైర్యస్థుల లక్షణం. అదే కాలేజీ జీవితం'' అంది సుప్రియ ఎంతో అనుభవశాలిలా.

''అందరి మనస్తత్వాలు ఒకేరకంగా వుంటాయా సుప్రియా! నేను ఇవిభరించలేను'' అంది సునంద.

అయితే ఓర్పుకూ, నేర్పుకూ మారుపేరుగా సుప్రియను మనసులో స్తుతించుకుంది సునంద.

సుప్రియ ఓదార్పుమాటలు కాలేజీ కుర్రాళ్లకు ఎలా తెలిసింది చెప్మా!

సుప్రియకు మరునాడు కాలేజీకి వెళ్లడానికి వీలుపడలేదు. ఎర్రచీర కట్టుకుని తల ఆరబోసుకుని హాస్టల్ ముందు లాన్స్‌లో పచార్లు చేస్తున్న సుప్రియ కాలేజీనుండి ముందుగానే తిరిగి వచ్చిన సునందను చూచి తన చేతిలోని 'రోమన్ లా' పుస్తకాన్ని చటుక్కున మూసివేసింది.

''ఈరోజు కాలేజీలో ఏమి జరిగిందో తెలుసా?''

సునంద సుప్రియతో ప్రశ్నార్థకంగా అడిగింది.

''ఏం జరిగిందేమిటి?'' అని నిబ్బరంగా అడిగింది సుప్రియ.

''గోడలమీద ఎక్కడ చూచినా నీ ముద్దుపేర్లనే! సుప్రియా మీన్స్ ఛాలెంజ్ క్వీన్ అనీ, సుప్రియా ఈజ్ ఏ డేర్ డెవిల్ అనీ ఇంకా ఏవో అధునాతన [illegible]

సునంద సగంలో ఆపింది. సు[illegible]

విప్పారింది. తాను టాక్ ఆఫ్ ది యూనివర్శిటీ అయినందుకు ఎంతో గర్వపడింది. ఆధ్యాత్మిక చింతన ప్లస్ అధైర్యం కలబోసి మూసపోసిన సునందతో తనను పోల్చుకుని తన ధైర్యసాహసాలకు మనసులో గర్వపడేది సుప్రియ. ఆ మాటకొస్తే సునంద తప్ప తనంత అందగత్తె యూనివర్శిటీలోనే లేదనే సంతృప్తి తనలో వుండేది. అందంలోనేకాక సాహసంలోకూడా తనను మించిన స్టూడెంట్స్ లేరని, తనను కిరణ్‌బేడీ, మెనీషాలాంటి ధీరవనితలతో పోల్చుకుని సంతృప్తి పడేది. మనో నిబ్బరం, ధీశక్తి, ఆత్మవిశ్వాసం మెండుగా దండిగాగల ఆమెను తెలుసుకున్నవారెవరైనా ఆమెను ప్రత్యక్షంగానో పరోక్షంగానో అభినందించకుండా వుండలేకపోయేవారు ఏ ఒక్కరిద్దరు పోకిరీ పిల్లలో తప్ప. అదే ఆమె సంతోషం, సంతృప్తి, సంబరం.

'నేటి సినిమాలు' అనే అంశంపై డిబేట్ జరుగుతున్నపుడు సునంద తన ఉపన్యాసంలో ప్రస్తుత సినిమా వ్యవస్థను గ్రహణం పట్టి అవస్థకు గురైన వ్యవస్థగానూ, కల్మషమైనదీ, కశ్మలమైనదిగాను అభివర్ణిస్తూ, అశ్లీలంగా అసభ్యంగా చిత్రీకరిస్తున్న చుంబన దృశ్యాలను అసహ్యించుకుని అలాంటి సినిమాలను అందరూ బహిష్కరించాలని చెప్పింది. ఈసారి చర్చలో సుప్రియ వంతు వచ్చింది.

''కాలానికి అనుగుణంగా నేటి సినిమాలు వస్తున్నవి. ముద్దు దృశ్యాల్లో తప్పులేదు. తప్పనిసరికూడాను. నటీనటులు ట్రాన్స్‌పరెంట్ డ్రెస్ వేసినా పొరపాటు కాదు. సమాజంలో సమానావకాశాలుగల పురుషులు ఎంత వివస్త్రంగా నటిస్తారో స్త్రీలుకూడా అంత వివస్త్రంగా నటిస్తే తప్పుఏముంది? నాకు సినిమాలలో నటించే అవకాశమొస్తే అర్ధనగ్నంగానైనా, పూర్తినగ్నంగానైనా ఏ భంగిమలోనైనా నటించడానికి అభ్యంతరం చెప్పను. మానవుడు నేకెడ్‌గానే పుడతాడు. నేకెడ్‌గానే కాటికి పోతాడు. ఆద్యంతములలో లేని సిగ్గు మధ్యలో ఎందుకు?'' అంటూ తన ఉపన్యాసాన్ని సుదీర్ఘ హర్షధ్వానాల మధ్య ముగించింది సుప్రియ.

సునందకు సుప్రియమీద విపరీతమైన కోపం జనించినా ఆమెయొక్క ధీశక్తికి ఆమెమీద మరింత అభిమానం పుట్టుకొచ్చింది. సుప్రియయొక్క భావాలను సునంద బహిరంగంగా వ్యతిరేకిస్తున్నా మరో జన్మలో తాను సుప్రియగా పుట్టాలని, అంతర్గతంగా మాత్రం భగవంతుని ప్రార్థించుకునేది.

## ప్రేమ

''డాడీ మన శత్రువుల్నికూడా ప్రేమించాలని అన్నావుకదా''

''అవునురా''

''అయితే మీ ప్రత్యర్థి కూతుర్ని నేను ప్రేమిస్తున్నాను''

''హా''

-సిహెచ్.వి.వి.ఎస్.మూర్తి (కొమరగిరిపట్నం)



కటకం ధూమశకటం కిటకిటలాడుతూ వాల్తేరు స్టేషనులో విజయవాడవైపుకు కదలడానికి సిద్ధమై కటువుగా కూసింది. ఆ కూత తమ ప్రిన్సిపాల్ పిలుపులా వినపడి త్రుళ్ళిపడ్డారు సునందా సుప్రియలు. వారిరువురకు స్టేషన్‌కు వచ్చిన విద్యార్థినులంతా విషణ్ణ వదనాలతో వీడ్కోలు చెబుతున్నారు. సహ విద్యార్థినులకు వీడ్కోలు ఇచ్చే మిషతో సునందా సుప్రియలున్న బోగీవద్దకు వచ్చి వారికి కూడా బైబైలు చెపుతున్న విద్యార్థులను త్రోసుకుని వచ్చి బోగీ కిటికీ పక్కగా ప్లాట్‌ఫారంపై విచార వదనంతో, పశ్చాత్తాప హృదయంతో నిలబడి వున్న శివశంకర్‌ను చూచి 'గుడ్‌లక్ శివా!' అంటూ కన్నుగీటిన సుప్రియ మాటలు తన హృదయంలో ఈటెలులాగా గ్రుచ్చుకుని సిగ్గుతో తలదించుకున్నాడు శివశంకర్. సునంద అతని కళ్లవంక పరీక్షగా చూడగా అతని కళ్లు ఇప్పుడు మామూలుగానే వున్నాయి. ప్రిన్సిపాల్ పొరబడ్డట్టు అతని కళ్లకు ఇప్పుడు ఏ వ్యాధీ సోకియుండలేదు. కృష్ణచంద్ కాశ్యప్ ఏమీ మాట్లాడక శివశంకర్ వెనుకే తలదించుకుని నేలకేస్తూ చూస్తూ వున్నాడు. రైలు కదలికతో సునందా సుప్రియలు క్రమక్రమంగా మిత్రులందరికీ దూరమై కనుమరుగైపోయారు. విజయవాడ స్టేషనులో దిగిన వారిద్దరు ఒకరు తూర్పు దిశకూ మరొకరు పశ్చిమ దిశకూ చీలిపోయారు.

నాల్రోజుల అనంతరం టెలిగ్రాం అందుకున్న సునంద బందరునుండి గుంటూరుకు హుటాహుటిన వెళ్లింది. సుప్రియ తల్లి శ్యామలాంబ సునందను కౌగిలించుకుని బావురుమంది. అతి సున్నిత మనస్కురాలైన సునంద ఆ పరిస్థితిని తట్టుకోలేకపోయినా సుప్రియ తనకు ఏతావాతా నూరిపోసిన ధైర్యం తనకిప్పుడు ఆయుధంగా ఉపయోగపడి మనసును దిటవు చేసుకుని మానవుని జీవితం బుద్బుదప్రాయం. తామరాకు మీద నీటిబొట్టులాంటిది. ఎప్పుడు ఎవరు ఎలా రాలిపోతారో ఆ పరమాత్మునికే ఎరుక. అందరం పోవాల్సిన వాళ్లమే. కాకపోతే ముందూ వెనుక. పుణ్యాత్ములు ముందు పోతారు. నాలాంటి 'పాపీ చిరాయువు' అంటూ శ్యామలాంబను ఓదారుస్తున్న సునంద, సుప్రియ వియోగాన్ని భరించలేక మూర్ఛపోయింది. ముఖాన్ని చన్నీళ్లు చల్లబడిన అనంతరం తెప్పరిల్లిన సునంద 'ఛాలెంజ్ రాణి, డేర్ డెవిల్' అయిన సుప్రియ చరిత్ర ఈ విధంగా అంతమవుతుందని తాను కాదుకదా ఆమె మనసు తెలిసిన ఎవరూ ఊహించరని రోదించింది సునంద.

సుప్రియ సుదీర్ఘ సుదూరపు ప్రయాణానికి స్వజనులతోపాటు రోదసికూడా రోదించింది. బందరుకు తిరిగివచ్చిన సునంద తీవ్ర ఆలోచనలో పడింది. తాను ఇంకా యూనివర్శిటీలో ఒంటరిగా నడిచేదెలా! లేడీస్ హాస్టల్‌లోని స్నేహితురాళ్లకు తన ముఖం చూపించేదెలా! సుప్రియ 'రోమన్ లా' పుస్తకంలో ఇరువది నాలుగవపేజీలో గుప్తంగా పదిలపరచుకున్న ఆ ఫోటోలోని ఇరువది నాలుగేళ్ల కో స్టూడెంట్ కృష్ణచంద్ర కాశ్యప్‌తో ఆమె మరణ కారణాన్ని వివరించేదెలా! యాక్సిడెంట్ అని చెప్పాలా! కార్డియక్ ఎరెస్ట్ అని చెప్పాలా! గుంటూరు ఎ.సి కాలేజీలో సుప్రియ తన తమ్ముని ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్ తెచ్చుటకై వెళ్లి మేడమెట్లు దిగుతున్నప్పుడు ఆకస్మికంగా వచ్చిన సుడిగాలికి ధరించిన చీర మోకాలి పైకి ఎగిరి, పైట పూర్తిగా తొలిగి క్రిందకు జారినప్పుడు ఫక్కున నవ్విన రోడ్‌సైడ్ రోమియోలలాటి విద్యార్థుల అవహేళనను అవమానంగా భావించి భరించలేక అంత ధైర్యస్తురాలూ క్షణికోద్రేకంలో అగ్నికి ఆహుతై ఆత్మహత్య చేసుకున్నదనే చేదునిజాన్ని వెల్లడించి ఎందర్ని నమ్మించగలను! కడుపు దహించుకునిపోయేసమాధానం దొరకని ప్రశ్న

పరంపరలు సునందను వెక్కిరిస్తూ వెంటాడుతూనే వున్నాయి. అవును. సుప్రియ పరాజిత.

తన నెచ్చెలి లేని ఒంటరి ఉనికి తనకుభారమని తీర్మానించుకున్న సునంద సెలవుల అనంతరం విశాఖ ప్రాంతంలో మరెవరికీ కనపడలేదు. ఎల్లప్పుడూ కళకళలాడుతూండే విశ్వవిద్యాలయ ప్రాంగణమంతా వెలవెలలాడింది. అక్కడ ఇప్పుడు రాగింగ్ లేదు. టీజింగ్ లేదు. డిబేటింగ్ లేదు. ఉన్నదల్లా నిరాశానిస్పృహలతో కూడిన విద్యార్థినీ విద్యార్థుల నిశ్శబ్దతను తొంగి తొంగి చూసే నిస్తేజమైన నింగి మాత్రమే.

◆ ❖ ◆

# సింగపూర్ సరదా



భారతీయులు విదేశాల్లో సినిమా తీద్దామని అనుకున్నట్లయితే ముందు వాళ్ళకి సింగపూరే గుర్తు వస్తుంది. అలాగే పారిశ్రామికవేత్తలకి జల్సాగా తిరిగి వద్దామని బయల్దేరితే సింగపూర్ కెళ్ళి షాపింగ్ చెయ్యాలనిపిస్తుంది.

1992వ సంవత్సరంలో ఒక లక్ష తొంభై అయిదు వేలమంది భారతీయులు సింగపూర్‌లో షాపింగ్ చేసినట్లు తెలుస్తోంది. సింగపూర్‌లో సేల్ జూలై పదిహేనునుండి ఆగస్టు పద్నాలుగుదాకా జరుగుతుంది. అక్కడి ఫుడ్ ఫెస్టివల్ జూలై ఒకటి నుండి ముప్పై ఒకటవ తారీఖుదాకా జరుగుతుంది.

సేల్ సమయంలో వస్త్రాలనుండి ఒంటికి పులుముకునే పెర్‌ఫ్యూమ్‌ల్ దాకా అన్నీ రిబేట్‌లో దొరుకుతాయి. ఆ రిబేట్ కూడా ఇరవై ముప్పై శాతం కాక డబ్బైశాతం ఉండడం విశేషం.

విమానం టిక్కెట్టు ధరని మాత్రం భరించగలిగితే చాలు. మిగతా అంతా మజాయే!

గురజాడ శోభా పేరిందేవి